క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న ఆలయం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో నూకాలమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెల 18వ తేదీన ఆలయ ప్రారంభోత్సవం చేసి అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు. గతేడాది ఏప్రిల్‌లో నూకాలమ్మ తల్లి జాతర అనంతరం నూతన ఆలయాన్ని పునర్నిర్మించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. దీంతో పాత ఆలయాన్ని తొలగించి శరవేగంగా నూతన ఆలయాన్ని నిర్మించారు. పనులు పూర్తికావస్తుండడంతో వచ్చే నెల నూతనాలయాన్ని పునఃప్రారంభించి, అమ్మవారిని పునఃప్రతిష్ఠ చేయనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సంవత్సరం నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు నూతన ఆలయంలోనే నిర్వహించనున్నారు.

దుస్తులు, స్వీట్స్ పంపిణీ



వృద్ధులకు దుస్తులు, స్వీట్స్ అందజేస్తున్న సోమరాజు తదితరులు

గండేపల్లి: ఉప్పలపాడుకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు గ్రామంలో పేదలకు దుస్తులు, స్వీట్స్ పంపిణీ చేశారు. పండగను పురస్కరించుకుని సుమారు 200 మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, పేదలకు తమ వంతుగా సాయంగా అందజేస్తున్నట్టు విశ్రాంత రైల్వే ఉద్యోగి సత్తి సోమరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని గత 15 సంవత్సరాలుగా చేస్తున్నట్టు తెలిపారు. ఎస్ శ్రీనివాస్, పి.శ్రీను, ఎస్.కిరణ్, టి.రమేష్, కె.గోవింద్, పి.చంటి, సీహెచ్ ప్రసాద్, ఎస్కె తాతాజీ, ఆలీ, పి.వి.ప్రసాద్, పి.శ్రీను, టి.లక్ష్మణ్, కాపు, జి.రమేష్, రాజు, ఎస్ కృష్ణమూర్తి, కె.సుబ్బారావు, జి.స్వామి, తదితరులు భాగస్వాములుగా ఉన్నట్టు పేర్కొన్నాడు.

వరికుప్ప దగ్ధం

రౌతులపూడి: శృంగవరంలో రెండు ఎకరాల్లో సాగు చేసిన ఈగల పెద్దయ్యకు చెందిన వరి కుప్ప బుధవారం దగ్ధమైంది. పొలంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించి వరి కుప్ప కాలి బూడిదైందని బాధిత రైతు వాపోయాడు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయాలకుపైగా నష్టం వాటిల్లినట్టు రైతు తెలిపాడు. ఈ ఘటనపై స్థానిక రెవెన్యూ, వ్యవసాయ అధికారులకు సమాచారం అందించమన్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రత్తిపాడు: ల్యాండ్ టైటిలింగ్ యాక్టును వ్యతిరేకిస్తూ ప్రత్తిపాడులో బుధవారం న్యాయవాదులు నిరసన చేపట్టారు. స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. జంక్షన్‌లో కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ పుల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బార్ ప్రతినిధులు చెలంకూరి రామకృష్ణ, లింగంపల్లి శివకుమార్, బొంగుకూరి మధుబాబు, పిల్లి బలరాముడు, ఆడారి సుగుణ, రాజాల చిట్టిబాబు, రవణం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమింపజేయాలి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీల వేతనాల పెంపుదల చేసి సమ్మె విరమింపజేసేలా ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి కోరారు. లేని పక్షంలో ఉద్యమం తీవ్ర రూపం దాల్చుతుందని హెచ్చరించారు. తమ డిమాండ్ల సాధన కోసం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద 37వ రోజు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన రిలే దీక్షా శిబిరాన్ని బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులను వివరణలు ఇస్తున్నారని దువ్వా శేషుబాబ్జి చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ర్యాలీగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి వెళ్లి, నోటీసులకు వివరణలు ఇచ్చారు.

జీడి మామిడీలా..

- ఆలస్యమైన జీడిమామిడి పూత
- సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు తప్పనిసరి అంటున్న వ్యవసాయాధికారులు



హంసవరం సమీప జీడిమామిడి చెట్లకు కానరాని పూత

తుని రూరల్: వాతావరణ పరిస్థితుల ప్రభావంతో జీడిమామిడి పూత ఆలస్యమైంది. సాధారణంగా డిసెంబరులో పూత వికసించాలి. అక్కడక్కడ పూత విచ్చుకుంటున్నప్పటికీ ఆశించినస్థాయిలో లేదని రైతులు వాపోతున్నారు. తెగుళ్లు సోకడంతో పెట్టుబడుల భారం అధికమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానశాఖ సబ్‌డివిజన్‌లో కోటనదూరు, తొండంగి, తుని, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో తొమ్మిది వేల హెక్టార్లలో జీడి మామిడి తోటలు సాగవుతున్నాయి. ఇప్పటి వరకూ 10 నుంచి 15 శాతం పూత కనిపిస్తుందని, ఈనెలాఖరుకి పూర్తిస్థాయిలో పూత రావచ్చని ఉద్యానశాఖ అధికారి జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. రైతులు సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే పూత, పిందెలు పుష్కలంగా వచ్చి మార్చిలో ఫలసాయం అందుతుందన్నారు.

యాజమాన్య పద్ధతులు

పూతరాని జీడిమామిడి తోటలకు ఒక తడి ఇవ్వాలని హెచ్ఓ విజయలక్ష్మి సూచించారు. ఒక్కొక్క చెట్టు మొదళ్లలో అర కిలో చొప్పున అమ్మోనియం సల్ఫేట్ వేసుకోవాలన్నారు. దీనివల్ల కొత్త చిగుర్లు వచ్చి తర్వాత పూత వికసిస్తుందన్నారు. చిగుర్లు ఏపుగా పెరిగిన తర్వాత మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు, మల్టీ-కే ఐదు గ్రాములు, బోరాన్ రెండు గ్రాములు చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పూత రావడానికి సహకరిస్తుందన్నారు.

సస్యరక్షణ చర్యలు

తేయాకు దోమ (టీదోమ) : తేయాకు దోమ (టీదోమ) ప్రభావం వల్ల 30 నుంచి 40 శాతం జీడిమామిడి దిగుబడిలు తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్ఓ పేర్కొన్నారు. టీదోమను నివారించడం ద్వారా నికర దిగుబడి సాధించవచ్చన్నారు. సాధారణంగా అక్టోబరు నుంచి ఏప్రిల్ వరకూ జీడిమామిడిలో తేయాకు దోమ కనిపిస్తుందన్నారు. దోమ ఆశించిన చెట్లలో లేత ఆకులు, పూత మాడిపోయి పక్వానికి రాకుండానే జీడి గింజలు నేలరాలిపోతాయి. తయారైన గింజలపై మచ్చలు ఏర్పడి ఫలసాయం నాణ్యత కోల్పోతుందన్నారు. ఉధృతి ఎక్కువగా ఉండే చెట్లు కాలిపోయినట్టు కనిపిస్తాయి. ఈ దోమ పిల్లదశ, తల్లి దశల్లో లేత కొమ్మలను, పూత రెమ్మలను ఆశించి రసాన్ని పీల్చడం వల్ల ఎర్రని జిగురు కారుతూ పూత, పిందెలకు నష్టం కలిగిస్తుందన్నారు.

నివారణా చర్యలు

తేయాకు దోమ, కాయ తినే పురుగులను నివారించేందుకు మూడు దశల్లో సస్యరక్షణ మందులు పిచికారీ చేయాలన్నారు. మొదటగా కొత్త చిగురు వచ్చే సమయంలో మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రెండోసారి పూత బయటకు వచ్చే సమయంలో లామ్డాసైహాలో 0.6 మిల్లీ లీటర్ల లేదా క్లోరిఫైరీఫాస్ రెండు మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి కొమ్మలు బాగా తడిచేలా పిచికారీ చేసుకోవాలి. మూడోసారి జీడి గింజ బఠాణి పరిమాణంలో ఉన్నప్పుడు ప్రొఫెనోఫాస్ ఒక మిల్లీ లీటర్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే సత్ఫలిస్తాయని ఆమె సూచించారు.

పూర్తి కావస్తున్న రబీ వరినాట్లు



ఎ.కొత్తపల్లిలో వేసిన వరినాట్లు

తొండంగి: మండలంలోని వ్యవసాయబోర్ల పరిధిలో రబీ వరినాట్లు దాదాపు పూర్తికావస్తున్నాయి. ఖరీఫ్ పంటలు ఒబ్బిడి చేసిన అనంతరం బెండపూడి, రావికంపాడు, కొమ్మనాపల్లి, గోపాలపట్నం, పి.ఇ.చిన్నాయపాలెం ముందుగా రబీ వరినాట్లు ప్రారంభమయ్యాయి. అనంతరం కోదాడ, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షంపేట, తొండంగి, శృంగవృక్షం తదితర ప్రాంతాల్లో వారం రోజుల నుంచి వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది మండల వ్యాప్తంగా సుమారు నాలుగు వేల ఎకరాల్లో వరినాట్లు వేసే అవకాశం ఉందని, మరో వారం రోజుల్లో నాట్లు పూర్తవుతాయని వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చరిత్రలో నిలిచిపోతుంది



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా విజయవాడలో ఏర్పాటు చేసిన దాదా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చరిత్రలో నిలిచిపోతుందని ఈ పండగకు అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలో సోమవారం స్థానిక సాయి బాలాజీ పంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ దళిత ఐక్య సమైక్య ఆత్మీయ కలయక వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఉభయగోదావరి జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్ గుల్లా ఏడుకొండల అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి తోట నరసింహం ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రపంచ మేధావని అన్నారు. అంబేడ్కర్ రచించన రాజ్యాంగం ప్రాధాన్యత, దాని వల్ల జరుగుతున్న మేలును ప్రశంసించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని భారతదేశ చరిత్రలోనే నిలిచిపోయేలా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విజయవాడలో నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ నెల 19న జరగనున్న విగ్రహావిష్కరణ ప్రజలందరూ తరలిరావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్‌వెస్లీ, జిల్లా సాంస్కృతి విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు అత్తులూరి సాయిబాబు, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, వివిధ గ్రామాలకు చెందిన దళిత నేతలు పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



యాత్రను ప్రారంభించిన సర్పంచ్ విజయదుర్గ

శంఖవరం: జి.కొత్తపల్లిలో వికసిత్ భారత్ సంకల యాత్ర బుధవారం నిర్వహించారు. ఈ యాత్రను స్థానిక సర్పంచ్ ఈగల విజయదుర్గ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు అమలు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని తరహాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, నోడల్ అధికారి రామకృష్ణ, ఎంఈఓ ఎస్‌వీ రమణ, ఏపీఓ రాజగోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సెబ్ దాడులు : నలుగురి అరెస్టు



నిందితులతో ప్రత్తిపాడు సెబ్ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలోని ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 15 మద్యం సీసాలు, 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం... ఒమ్మంగి గ్రామంలో 20 లీటర్ల సారాతో మొగిలి సత్యవతిని, ఆమెకు సారా అందించిన సత్తెనపల్లి శ్రీనులను అదుపులోకి తీసుకున్నారు. ధర్మవరం గ్రామంలో బెల్ట్ షాపుపై దాడి చేసి పంపనబోయిన తాతాజీని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 180(ఎంఎల్) గల 15 డ్యూటీ పేయిడ్ లిక్కర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కిర్లంపూడి మండలం తామరాడలో సారా బట్టీపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సంఘటన స్థలం నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, నుదునుమర్తి రాంబాబును అరెస్టు చేశారు. నిందితులపై బైండోవర్ నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడుల్లో కాకినాడ ఇంటిలిజెన్స్ వింగ్ సీఐ కె.గిరిధర్, ప్రత్తిపాడు సెబ్ ఎస్సై బి. శ్రీనివాసరావు, హెచ్‌సీలు వెంకన్నదొర, కృష్ణార్జున తదితర సిబ్బంది పాల్గొన్నారని సెబ్ సీఐ అశోక్ తెలిపారు.

అలనాటి జ్ఞాపకాలు పదిలం



తామరాడ స్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కిర్లంపూడి: తామరాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-2002 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఉద్యోగాలు, వ్యాపార రీత్యా పలు చోట్ల స్థిరపడిన వారాంతా అదే స్కూల్‌లో కలుసుకొని గత జ్ఞాపకాలను నెమరువేసుకొని రోజంతా సందడి చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి వారికి విద్యాబుద్ధులు నేర్పిన హెచ్‌ఎం నిర్మాలదేవి పలువురు గురువులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆరిశ హనుమంతురావు, మోటేపల్లి శివరామగణేష్, ఆరిశ సత్యనాంధం, నేటిపల్లి సతీష్, పేపకాయల గంగాధర్, సరిసే సంతోష్, నీటిపల్లి నాగదేవి, పీలా నాగరవర లక్ష్మి, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా త్రిమూర్తుల స్వామి తీర్థం



త్రిమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకుడు

తుని రూరల్: చేపూరులో 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న త్రిమూర్తుల స్వామి ఆలయం వద్ద బుధవారం తీర్థం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు త్రిమూర్తుల స్వామిని దర్శించి, పూజలు చేశారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో ప్రమాదాలు నివారణకు హైవే అధికారులు, రూరల్ పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. గ్రామస్తులతో పాటు రాజుపేట, మర్లపాడు, వెలమ కొత్తూరు, కొత్త వెలంపేట, ఎర్రకోనేరు, జగన్నాథగిరి, గెడ్డబీడు, తుని తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి, తీర్థంలో పాల్గొన్నారు.

నేడు : తుని మండలం జగన్నాథగిరి శివారు మెట్టపై గురువారం బాలయోగి తీర్థం నిర్వహించనున్నారు. ముక్కనుమ మరుసటి రోజు ఇక్కడ తీర్థం నిర్వహించనుండగా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై బస్సు దగ్ధం



దగ్ధమైన టూరిస్టు బస్సు

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం జాతీయ రహదారిపై జోడుగెడ్ల వంతెన సమీపంలో ఆర్టీసీ బస్సు దగ్ధమైంది. ఆ వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సు ధర్మవరానికి వచ్చే సరికి ఈ ప్రమాదానికి గురైంది. ఇందులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. శబ్దాలు రావడంతో అందరినీ కిందకు దించేయడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని, తిరిగి అధికారంలో వస్తుందని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. యూజే పురంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కష్టపడి పని చేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపునిస్తుందన్నారు. తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత వరుపుల సూరిబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, పార్టీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీ అమరాది కాశీ, మాజీ సొసైటీ అధ్యక్షుడు పప్పల చక్రం, పార్టీ నాయకులు ఒట్టికోళ్ల నూకరాజు, తేటకాయల శివ తదితరులు పాల్గొన్నారు.

షర్మిలారెడ్డికి దవులూరి సత్కారం

సామర్లకోట: నూతన హౌసింగ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మేడపాటి షర్మిలారెడ్డిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు సత్కరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి షర్మిలారెడ్డిని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో ఆమె బుధవారం విజయవాడ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దాంతో ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు.

పేదలు, వృద్ధులకు వస్త్రదానం

సామర్లకోట: స్థానిక సంగీతరావుపేట, అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద బుధవారం పేదలు, వృద్ధులకు వస్త్రదానం చేశారు. వేల్పుల పద్మరాజు, నాగన్నల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సంగీతరావుపేట, బలుసులపేట, వీర్రాఘవపురం ప్రాంతాలకు చెందిన 100 మంది పేదలను గుర్తించి వస్త్రదానం చేశారు. ఏడేళ్లగా ఏటా ముక్కనుమ రోజున వస్త్రదానం నిర్వహిస్తున్నట్లు వేల్పుల సత్యనారాయణ, నూకరత్నం, అప్పారావు తెలిపారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

కరప: ఎన్నికల్లో వినియోగించే ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లు ఎలా పనిచేస్తాయో ఓటర్లందరూ అవగాహన కల్పించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. అరట్లకట్టగ్రామంలో బుధవారం ఓటర్లతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జి.శ్యామ్‌ప్రసాద్, టీఆర్ఎస్ ప్రసాద్‌లతో కలసి డీటీ అనిల్‌కుమార్ ఓటర్లకు ఈవీఎంల గురించి, అవి ఎలా పనిచేస్తాయో, దానిపై ఎలా ఓటు వేయాలో, కౌంటింగ్ తదితర విషయాలను వివరించి, ఓటర్లకు అవగాహన కల్పించారు.

చెత్త తొలగించరూ...



రహదారి ఆనుకుని ఉన్న చెత్త

ఏలేశ్వరం: నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి చెంతే చెత్త పేరుకుపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తతో పాటు దుర్గంధం వెదజల్లడంతో రాకపోకలు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి మీదుగా తిరుమాలి గ్రామస్తులతో పాటు జగనన్న కాలనీ వాసులు, సమీప ఆయకట్టు రైతులు రాకపోకలు సాగిస్తున్నారు. స్థానిక కప్పలచెరువు సమీపంలోని శశ్మాన వాటిక అనుకుని రహదారి ఉంది. రహదారి సమీపంలో నివాసం ఉంటున్న కాలనీవాసులు దుర్గంధ భరించలేకపోతున్నారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకుని చెత్త తొలగించాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పిఠాపురం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు సామర్లకోట రైల్వే ఎస్సై బి.లోవరాజు తెలిపారు. రైల్వే ట్రాక్‌పై పడి ఉన్న వ్యక్తి వంటిపై లేత నీలి రంగు చొక్కా, ముదురు నీలి రంగు ఫ్యాంటు ఉన్నాయన్నారు. మృతుడి కుడి చేతిపై కన్నమ్మ అనే పచ్చ బొట్టు ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టుఆయన తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పిఠాపురం రైల్వే అధికారులకు, సామర్లకోట పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

హోరాహోరీగా సీపీకే టోర్నీ

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప (సీపీకే) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నీ తుదిదశకు చేరుకుంది. ఇందులో బుధవారం రెండు సెమీఫైనల్స్ జరిగాయి. మొదటి సెమీ ఫైనల్‌లో పెద్దాపురప్పాడు, గురజనాపల్లి జట్లపై జరిగింది. మొదటి బ్యాటింగ్ చేసిన పెద్దాపురప్పాడు జట్టు 18.5 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్ చేసిన గురజనాపల్లి జట్టు 16.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసి విజేతగా నిలిచి, ఫైనల్స్‌కు చేరుకుంది. తర్వాత జరిగిన రెండో సెమీఫైనల్‌లో వేళంగి, కరప జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన వేళంగి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత చేజింగ్‌కు దిగిన కరప జట్టు 19.3 ఓవర్లలో ఏడువికెట్ల నష్టానికి 133 పరుగులు చేయడంతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. గురువారం గురజనాపల్లి, కరప జట్ల మధ్య ఫైనల్స్ జరుగుతాయని సీపీకే అధ్యక్షుడు, జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు దేవు మధు వీరేష్ తెలిపారు.